ఊరూరా పింఛన్ల పండుగ

- వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో 100 శాతం పంపిణీ పూర్తి

రాయదుర్గం: వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుతో వారం రోజులుగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఊరూవాడా పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంచలంచెలుగా పింఛన్ సొమ్ము పెంచుతూ వచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ నెల నుంచి రూ.3 వేలకు పెంచిన నగదును అధికారులు, వలంటీర్లుగా సమర్థవంతంగా పంపిణీ చేశారు. దీంతో పేద కుటుంబాలన్నీ ఆనందంతో మురిసిపోతున్నాయి. రాయదుర్గం లో 37,968 మంది, కళ్యాణదుర్గంలో 37,784, ఉరవకొండలో 36,103 మందికి రూ.3111.2 లక్షల నగదు పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తిచేశారు. పెన్షన్ అందుకున్న వారంతా జగన్‌కు జేజేలు పలుకుతున్నారు. ఈ ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. పేదల జీవితాల్లో జగన్ వెలుగులు నింపారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్ గ్రామంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటస్వామి, నాయకులు వెంకటాక్షిపతిరెడ్డి రామకృష్ణ, ప్రకాష్‌రెడ్డి, శ్రీరాములు, భూమిరెడ్డి దితరులు పాల్గొన్నారు.



డి హీరేహాళ్ మండలం సోములాపురంలో పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

విడపనకల్: మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, చీకలగురికి తదితర గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పింఛన్ కార్యక్రమం నిర్వహించారు. చీకలగురికిలో ఎంపీటీసీ, కొత్తపల్లి సురేఖ, మర్రిస్వామి, మహేష్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డిష్ వెంకటేశులు, రహమత్ హుస్సేన్, కావలి వెంకటేశులు, కొత్తపల్లి రామాంజనేయులు, కొత్తపల్లి శ్రీనివాస్, సుంకప్ప, రాము, నరసింహ, బాలరాజు ఓబులపతి, చంద్ర, మారుతి తదితరులు పాల్గొన్నారు

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు సచివాలయం వద్ద పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం లబ్ధిదారులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచు సురేంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్ పార్వతి, నాయ కులు పరమేష్, తిమ్మారెడ్డి, గ్రామ కార్యదర్శి సుభాన్‌జీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు



విడపనకల్లు మండలం చీకలగురికిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



వజ్రకరూరు మండలం గడేహోతురులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

నేటి నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

రాయదుర్గం రూరల్/బొమ్మనహాళ్/కూడేరు/బెళుగుప్ప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు బుధవారం నుంచి 20వ తేదీ వరకూ మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం, బొమ్మనహాల్, కూడేరు, బెళుగుప్ప ఎంపీడీఓలు కొండయ్య, షకీలాబేగం, నాగభూషణ రామచంద్ర, మంగళవారం వేర్వేరుగా తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 120 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని దేవగిరికి చెందిన అంజనయ్య అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

స్టార్టర్ బాక్స్ చోరీ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రైతు లింగమూర్తికి చెందిన తోటలోని బోరుబావి మోటారుకు అమర్చిన స్టార్టర్ బాక్స్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.8500 నష్టపోయాయన బాధిత రైతు వాపోయాడు. వారం క్రితం వెంకటాద్రిపల్లి సమీపంలో స్టార్టర్ బాక్స్‌తో పాటు డ్రిప్ వైర్లు, టార్పాలిన్లు దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు స్పందించి దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

క్లుప్తంగా

రెగ్యులర్ వర్కర్ల సేవలను అడ్డుకోవద్దు



కార్మిక సంఘాలతో చర్చిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

రాయదుర్గం/టౌన్: కాంట్రాక్ట్ వర్కర్లు సమ్మెలోకి దిగడంతో పట్టణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల అవసరాలు తీర్చేందుకు వెళ్తున్న రెగ్యులర్ కార్మికుల సేవలను సైతం అడ్డగిస్తూ మరింత కష్టాల్లోకి నెట్టొదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హితవుపలికారు. కమిషనర్ దివాకర్‌రెడ్డితో కలసి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్మిక సంఘాల ప్రతినిధులు సీఐటీయూ మల్లికార్జున, సీపీఎం నాగరాజు, మున్సిపల్ సంఘాల యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యకు పరిష్కారం చూపేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ రంగయ్య రాక

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయ కర్త, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య బుధవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి రానున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బసవరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించే నాయకులు , కార్యకర్తల ఆత్మీయ సమావేశం లో పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రూరల్ సీఐ ఎన్వీ నాగరాజు

కళ్యాణదుర్గం రూరల్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఎన్వీ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని పెన్నానది పరివాహక గ్రామం మానిరేవులో మంగళవారం సీఐతో పాటు సిబ్బంది పర్యటించారు. సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామస్తులు శాంతియుతంగా జీవించాలన్నారు.

శ్రీరామిరెడ్డి పైపులైన్ లీక్

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లిల్లో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథా అవుతోంది. మంగళవారం ఉదయం చెర్లోపల్లి ప్రధాన రోడ్డు ప్రక్కన ఉన్న పైపులైన్ పగలడంతో పైపుల వుంచి నీరు ఉధృతంగా ఉబికి బయటికి వస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి నీటి వృథాను ఆపాలని ప్రజలు కోరారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



వార్డుల్లో నీటిని సరఫరా చేస్తున్న మెట్టు ట్యాంకర్లు

రాయదుర్గం: కార్మికుల సమ్మెతో పట్టణంలో తలెత్తిన తాగునీటి ఇబ్బందులు తీర్చేలా ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప కృషి చేశారు. ప్రత్యేక నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి వార్డుల్లోని ప్రజలకు సంవృద్ధిగా నీటి సరఫరా జరిపేలా చొరవ చూపారు. ప్రజలంతా ఈ కొద్ది రోజులు పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించారు. దీంతో మెట్టు, చైర్‌పర్సన్ లకు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ వైఎస్ఎస్ కమిటీ ఎన్నిక





అధ్యక్షుడు వసంత్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం

ఉరవకొండ: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏపీ ఎరుకుల సేవా సంఘం(వైఎస్ఎస్) నియోజకవర్గ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ ఆధ్వర్యంలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా సాకే వసంత్, ప్రధాన కార్యదర్శిగా సాకే పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా వీరేంద్ర, గంగన్న, కార్యదర్శిగా సుబ్బరాయుడు, నరసింహులు, మహేంద్ర, సహాయ కార్యదర్శులుగా వీరేష్, శేషాద్రి, ఆంజనేయులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఎరుకుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రాత్మక ఘట్టం

- వైఎస్సార్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం
- పార్టీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో చరిత్రాత్మక ఘట్టమని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ పార్కులో మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను ఇచ్చిన మాట మేరకు వంద శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ, పథకాలను నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. పదవుల్లో సామాజిక న్యాయంతో అన్ని వర్గాలకు సముచితం కల్పించారన్నారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్ పార్కును అందంగా తీర్చిదిద్దుతామన్నారు. మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జెడ్పీటీసీలు బొమ్మన్న, గుద్దెళ్ల నాగరాజు, నాయకులు గోళ్ల సూరి, వెంకటేశులు, అన్ని మండలాల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్లు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు



విడపనకల్లులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విడపనకల్లు: మండల కేంద్రంలో ఎంపీపీ కరణం పుష్పవతి, జెడ్పీటీసీ హనుమంతు ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకుందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నా రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం భీమరెడ్డి, సుంకన్న, గిరిబాబు, దేశాయి సిద్ధార్థ, ఎంపీటీసీలు మల్లికార్జున, తిమ్మరాజు, మహేష్, రాజశేఖర్, సర్పంచులు మల్లికార్జున రెడ్డి, రఘురాం, రాజశేఖర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, ఎల్ఓ కుళ్లాయి స్వామి, ఓబులేసు, డిష్ వెంకటేష్, హనుమంతు, సునీల్ రెడ్డి, ఓబులప్ప, శ్రీనివాసులు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు

కణేకల్లు: కణేకల్లు చెరువు అవుట్ ఫ్లో రెగ్యులేటర్ వద్ద తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. చెరువు అవుట్ ఫ్లో రెగ్యులేటర్ వద్ద ఇటీవల కూలిన బ్రిడ్జిని మంగళవారం ఆయన పరిశీలించారు. గంగలాపురం, రచ్చుమర్రి గ్రామ ప్రజలతోపాటు ఈ ప్రాంతంలోని పొలాలున్న రైతుల ఇబ్బందులను కలెక్టర్ గౌతమి దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్ గ్రాంటు రూ.2.50 లక్షలు మంజూరు చేయించామన్నారు. బుధవారం ఈ పనులకు టెండర్ ఉందని, పదిరోజుల్లో పనులు పూర్తయ్యేలా చూస్తానని మెట్టు హామీచ్చారు. అనంతరం ఆయన హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్‌తో పనుల గురించి చర్చించారు. దిగువన రెండు పైపులు వేసి దానిపై ఇసుక బస్తాలు పరిచి దారి చేస్తామని ఏఈఈ మెట్టు దృష్టికి తెచ్చారు. బైక్, ఆటోలాంటి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా దారి వేయాలన్నారు. అలాగే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తిరగకుండా చూడాలని హెచ్చెల్సీ అధికారులకు ఆదేశించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, యర్రగుంట మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవరెడ్డి, కళేకుర్తి సర్పంచు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వై.చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు ముల్లంగి నారాయణస్వామి, హళ్లి నాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, కొత్తపల్లి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలుసాబ్, తుకారాం, ఇమామ్‌వలి పాల్గొన్నారు.



చెరువు అవుట్‌ఫ్లో రెగ్యులేటర్ వద్ద కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు

మైనార్టీల ద్రోహి 'చంద్రబాబు'

రాయదుర్గం: ముస్లిం, మైనార్టీల ద్రోహి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. మంగళవారం తన నివాసం వద్ద 'సాక్షి' తో ఆయన మాట్లాడారు.. టీడీపీ అధికారంలో ఉన్ననాళ్లు మైనార్టీలను అవమానించేలా చంద్రబాబు ప్రవర్తించాడని దుయ్యబట్టారు. ఆయన కేబినెట్‌లో మంత్రి పదవి కూడా ఇవ్వకుండా మోసం చేశాడని ధ్వజమెత్తారు. రాయదుర్గంలోనూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు ఆ వర్గాల నుంచి ఆదరణ కరువై ఆరాటం మొదలైందన్నారు. ఈ కారణంగా ఆత్మీయ సమ్మేళనం ముసుగులో ఓట్ల రాజకీయానికి తెరతీశాడన్నారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుదాం

కళ్యాణదుర్గం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం ఈనెల 19న విజయవాడలో నిర్వహించే 125 అడుగుల విగ్రహావిష్కరణ సందర్భంగా చేపట్టాల్సిన కార్యచరణపై నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. మహనీయులు అడుగు జాడల్లోనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందుకెళ్తున్నారన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపన సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ మనస్పర్థలు వీడి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయంఫణి, ఎంపీపీ మారుతమ్మ, నాయకులు వెంకటేశులు, తిమ్మరాయుడు, గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, చందన శివాజీ, రేవన్న, ఎర్రిస్వామి, బసవరాజు, గోవిందు, హనుమంతరాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, పరంధామరెడ్డి, మల్లికార్జున, కృష్టారెడ్డి, నారాయణస్వామి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

కూడేరు: ప్రతిఒక్కరూ అంబేడ్కర్ బాటలో నడుద్దామని ఎంపీడీఓ నాగభూషణరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని అన్ని సచివాలయాల్లో జన్‌భాగీదారి (సామాజిక న్యాయ మహాశిల్పం) సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కూడేరులోని సచివాలయంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, వైస్ ఎంపీపీ దేవ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ లలితమ్మతో కలసి ఆయన అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ ఉందన్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్‌కు బాటలో నడుస్తామని అంగీకరిస్తూ సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. మిగిలిన సచివాలయాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక గ్రామసచివాలయంలో మంగళవారం సామాజిక సమతా సంకల్పం (జన్‌భాగీదారి) సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఉపసర్పంచు మధుసూధన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు.అలాగే సచివాలయం -2లో కూడా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

పోలీసులపై టీడీపీ, పచ్చ మీడియా విషం

ఉరవకొండ: విడపనకల్లు మండలం పాల్తూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో చంద్రమోహన్ అనే వ్యక్తిని పోలీసులు కొట్టారంటూ టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. మంగళవారం స్థానిక వైఎస్సాఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీపీ నరసింహులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఎల్లో మీడియా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. పోలీసుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా భావిస్తున్నామన్నారు. చీకులగురికి లో వైఎస్సార్‌సీపీ జెండాకు నిప్పుపెట్టి కాల్చిన ఘటనలో చంద్రమోహన్ అనే టీడీపీ కార్యకర్తను స్టేషన్‌కు పిలిచి విచారించారన్నారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న చంద్రమోహన్ తనతంతాను దుస్తులు విప్పి స్టేషన్ బయట తిరిగాడన్నారు. ఈతతంగం మొత్తం పోలీసు స్టేషన్ సీసీటీవీ రికార్డులో స్పష్టం ఉందన్నారు. దీంతో పాటు అక్కడే ఉన్న కానిస్టేబుల్‌పై కూడా టీడీపీ కార్యకర్త దాడి చేశారన్నారు. ఇంత జరిగినా టీడీపీ, ఎల్లో మిడీయా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలు తెలుసుకుని లోకేష్ ట్వీట్ చేస్తే బాగుంటుందన్నారు. టీడీపీ హయంలో ఉరవకొండలో రాక్షస పాలన సాగిందని గుర్తుచేవారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే ఆంజనేయులు, ఉలిగన్న, మండల అగ్రి బోర్డు చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'



ఉరవకొండ మండలం ఆమిద్యాలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



కళ్యాణదుర్గం మండలంలోని బ్యాడ్రహళ్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉరవకొండ: పేదకలు జగనన్న ఆరోగ్య సురక్ష వరమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పావని, వెంకటేష్‌నాయక్, శైలజ, అర్జున్ 380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈఓఆర్డీ చంద్రమౌళి,,సీహెచ్‌ఓ నాగరంగయ్య, సర్పంచ్ శ్రీరాములు, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బ్యాడ్రహళ్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాలమాన్, వైద్యులు విజేంద్ర, ప్రత్యూష, ప్రసన్న భారతి, నాయకులు మల్లన్న, హనుమంతురాయుడు, సచివాలయ సిబ్బంది, వలటీర్లు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని కళేకుర్తిలో మంగళవారం మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, సర్పంచు కె.భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వైద్యశిబిరంలో డాక్టర్లు విజయకుమార్‌నాయక్, పావని, చంద్రశేఖర్ 357మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచు బోయ రామిరెడ్డి, ఎంపీటీసీ మారెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేంద్ర, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 373 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు ఆవులదట్ల వైద్యుడు రాజేంద్ర ప్రసాద్, మాధవ్, మోహన్‌కుమార్, ప్రతిభ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, సర్పంచ్ కాపు వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని ఇప్పేరులో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యం కోసం పి.నాగిరెడ్డి పల్లి, అంతరగంగ, ఇప్పేరు ప్రజలు క్యూకట్టారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు ప్రతిమ, గైనికాలజిస్టు ఉమాదేవి, మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, సౌమ్య రెడ్డి 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు , ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి, సీహెచ్‌ఓ వరలక్ష్మీ, సూపర్ వైజర్ రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కణేకల్లు మండలం కళేకుర్తిలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి



రాయదుర్గం మల్లాపురం గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండయ్య



కూడేరు మండలం ఇప్పేరులో వైద్యసేవలందిస్తున్న నిపుణులు

'విశ్రాంత ఉద్యోగుల భవనానికి కృషి'

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల అదనపు భవనానికి కృషి చేస్తానని కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలపై ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, అధ్యక్షులు శివప్రసాద్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని, త్వరలోనే నిధులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు వెంకటేశులు, పెన్షనర్లు అంజినప్ప, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు వీడ్కోలు

కణేకల్లు: కణేకల్లు నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప మాలధారులకు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి వీడ్కోలు పలికారు. మాలధారుల ఇరుముడి కార్యక్రమం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాలధారులను ఆప్యాయంగా పలుకరించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.